ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 30.11.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వెనుకబడిన వర్గాల పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్రంలో ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.
2. అంగన్వాడి కేంద్రాల్లో పోషకాహారం నాణ్యతా ప్రమాణాల పై రాజీ పడేది లేదని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క స్పష్టం చేశారు.
3. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నూతన చైర్మన్ గా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియమితులయ్యారు.
4. ఆసిఫాబాద్ జిల్లాలో యువతిపై దాడి చేసిన పులి ఆనవాళ్లు గుర్తించేందుకు ఆటవీశాఖ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు.

----------------------------

**SRIDHAR BABU**

50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించడమే తమ ప్రభుత్వ అభిమతమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ

ఆధ్వర్యంలో ఈ రోజు హైదరాబాద్ లోని టీహబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమ్మిళిత అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే అత్యుత్తమ ఎంఎస్‌ఎంఈ పాలసీ తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు కులాల వారీగా అందించడానికే కులగణన చేస్తున్నామన్నారు. బలహీన వర్గాల పారిశ్రామికవేత్తల కోసం బిక్కి ఏర్పాటు అభినందనీయమని, బిక్కి ప్రతిపాదనలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాల్లో మార్పులు తీసుకొస్తామన్నారు. వెనుకబడిన వర్గాల పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ పరిశ్రమలు విస్తరించే ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీధర్‌బాబు ప్రకటించారు.

**DESK**

-------------------

**సీతక్క**

రాష్ట్రంలోని అంగన్వాడి కేంద్రాల్లో పోషకాహారం నాణ్యతా, సరఫరాలపై ఎలాంటి రాజీలేదని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. మారు మూల ప్రాంతాల్లోని అంగన్వాడీలకు కూడా ప్రతి రోజు పాల సరఫరా జరగాల్సిందేనని అధికారులను ఆదేశించారు. ఈ విషయమై హైదరాబాద్ లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, అంగన్వాడీ కేంద్రాలకు పాలు, పప్పు వంటి వస్తువుల సరఫరా, నాణ్యత, ఆయా సంస్థల పనితీరును పరిశీలించారు. సరఫరాలో కొన్ని ప్రాంతాల్లో అంతరాలను వెంటనే సరిచేయాలని, కేంద్రాలకు తగిన

స్థాయిలో పాల సరఫరా చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

**MSL**

--------------------

**రేవంత్ రెడ్డి**

ఒక్క ఏడాదిలో 54 వేల కోట్ల రూపాయిలతో రైతుల జీవితాల్లో పండగ తెచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. ఈ సంతోష సమయంలో అన్నదాతలతో కలిసి రైతు పండగలో పాలు పంచుకునేందుకు పాలమూరుకు వస్తున్నట్లు చెప్పారు.

**X**

---------------------------

**రైతు పండుగ**

మహబూబ్ నగర్ సమీపంలోని అమిస్తాపూర్ నిర్వహిస్తున్న రైతు పండుగ ముగింపు కార్యక్రమం ఈ సాయంత్రం జరగనుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఏర్పాట్లు పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వ్యవసాయ, అనుబంధ అంశాలపై ప్రదర్శన, అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

**పీటీసీ, మహబుబ్ నగర్**

-------------------

**HARISH RAO**

రైతుబంధు పథకాన్ని  కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతంగా రద్దు చేయాలని చూస్తోందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు.  రైతుబంధు కంటే, సన్న వడ్లకు ఇచ్చే 500 రూపాయిల బోనసే మేలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్తున్నారని, 5 లక్షల 19 వేల క్వింటాళ్ల సన్న వడ్లకు దక్కిన బోనస్ 26 కోట్ల రూపాయలు అయితే, రైతుబంధు కింద 7 వేల 500 కోట్ల రుపాయిలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ లెక్కల ప్రకారం రైతుబంధు కంటే బోనస్ అందించడం రైతులకు మేలు ఎలా అవుతుందని ప్రశ్నించారు.

**X**

-------------------------------

**TGPSC CHAIRMAN**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నూతన ఛైర్మన్ గా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియమితులయ్యారు. డిసెంబర్ మూడో తేదిన ప్రస్తుత ఛైర్మన్ మహేందర్ రెడ్డి పదవీకాలం ముగుస్తుండటంతో, ప్రభుత్వం వెంకటేశంను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. కాగా, ఆయన ప్రస్తుతం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

**PN**

----------------------------

**BJP- సంఘటన్ పర్వ్**

BJP సంస్థాగత ఎన్నికలకు సంబంధించి జిల్లా స్థాయి, క్షేత్ర స్థాయి నాయకులు నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల, జిల్లా స్థాయిలో ఎన్నికల నిర్వహణపై  అవగాహన కోసం హైదరాబాద్ లో ఈ ఉదయం ఆయన సంఘటన్ పర్వ్ – కార్యశాలను ప్రారంభించారు. BJP ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్, పార్టీ కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల సహ ఇంచార్జీ అరవింద్ మీనన్, పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇంచార్జీ ఎండల లక్ష్మీనారాయణ, పార్లమెంటు, శాసనసభ సభ్యులు, పదాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సంస్థాగత ఎన్నికల నిర్వహణలో జిల్లా, మండల నాయకత్వానికి ఈ సందర్భంగా దిశానిర్దేశం చేస్తారు.

**MSL**

----------------------------

**TTD**

తిరుమలలో రాజకీయ ప్రసంగాలపై నిషేదం ఈరోజు నుంచి అమలులోకి తెచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం-టీటీడీ ప్రకటించింది. కొంతమంది రాజకీయ నాయకులు దర్శనం తర్వాత ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ... రాజకీయ విమర్శలు, ప్రసంగాలు చేయడం పరిపాటిగా మారిందని, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

**PN**

-------------------------------

**పులి- ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ మండలంలో నిన్న యువతిపై దాడి చేసి, చంపిన పులి జాడను గుర్తించడానికి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్టు ఆ జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ తెలిపారు. మరోవైపు కాగజ్ నగర్ మండలంలో పులి సంచారం ఉందని ఈస్గాం గ్రామం, నజ్రుల్ నగర్, సీతానగర్, అనుకోడ, గన్నారం, కదంబా, అరెగూడా, బాబునగర్ గ్రామ పరిసరాల్లో సాయంత్రం పూట వ్యవసాయ పనులకు వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేస్తూ... అక్కడ 144 సెక్షన్ విధిస్తున్నట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

**పీటీసీ, ఆసిఫాబాద్**

---------------------------

**భద్రాద్రి కొత్తగూడెం**

ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ కింద మహిళా సమాఖ్య ద్వారా 1 మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కొత్తగూడెం జిల్లాలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని ఆ జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ విద్యుత్ ఆదేశించారు. పలు అంశాలపై అధికారులతో ఈరోజు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ కు సూచించారు.

**పీటీసీ, కొత్తగూడెం**

-----------------------------

**AMERICA TELUGU STUDENT**

అమెరికాలోని చికాగోలో దుండగులు జరిపిన కాల్పుల్లో ఖమ్మం జిల్లా రామన్నపేటకు చెందిన నూకరపు సాయితేజ అనే విద్యార్థి మృతి చెందారు.అతని వయసు 26 సంవత్సరాలు, ఎం.ఎస్ చదవడానికి 4 నెలల క్రితమే సాయితేజ అమెరికా వెళ్లారు. సాయితేజ ఒక షాపింగ్ మాల్ లో ఉద్యోగం చేస్తుండగా, దోచుకోవడానికి వచ్చిన దుండగులు కాల్పులు జరిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

**Desk**

----------------------------

**ఆసిఫాబాద్-ఎంపీడీవో**

ఆసిఫాబాద్ జిల్లాలోని లింగాపూర్ ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న రామేశ్వర్ ఈ ఉదయం గుండెపోటుతో మరణించారు. ఈ ఉదయం చాతిలో నొప్పి రాగా, ఇంటి నుంచి ఆస్పత్రికి తరలించే క్రమంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**పీటీసీ, ఆసిఫాబాద్**

-------------------------

**వాతావరణం**

నైరుతి బంగాళాఖాతంలోక ఏర్పడిన 'ఫెంగల్ ' తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని చెప్తూ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.

మరోవైపు ఉత్తర తెలంగాణలో చలితీవ్రత కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో 11 డిగ్రీల లోపు వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

**PN**

-----------------------------

**CRPF**

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో... హైదరాబాద్ లోని నెహ్రూ యువ కేంద్రం ఈ నెల 25న ప్రారంభించిన యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమం ఈ మధ్యాహ్నం ముగిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా 132 మంది కాశ్మీరీ కళాశాల విద్యార్థులు CRPF హైదరాబాద్ ప్రాంగాణాన్ని సందర్శించి అనేక విషయాలు తెలుసుకున్నారు. CRPF విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆయుధ ప్రదర్శన కూడా నిర్వహించింది. మాంటిస్సరీ స్కూల్, క్వార్టర్ గార్డ్స్, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెప్పే వివిధ మతపరమైన ప్రదేశాలను విద్యార్థులు ఉత్సాహంగా సందర్శించినట్లు సీఆర్పీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది.

**PN**

----------------------

**మంచిర్యాల పత్తి**

మంచిర్యాల జిల్లా తాండూరు మండలం రేపల్లెవాడలోని మహేశ్వరి, శ్రీరామ జిన్నింగ్ మిల్లుల లో డిసెంబర్ 2, 3 తేదీలలో సిసిఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధం భాస్కర్ ఒక ప్రకటన లో తెలిపారు. మిల్లులో పత్తి నిలువలు పేరుకుపోవడంతో కొనుగోలు

నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగో తేదీ నుంచి తిరిగి కొనుగోలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

**పీటీసీ, మంచిర్యాల**

---------------------

**JALAMANDALI**

పెండింగ్ నీటి బిల్లులు చెల్లించేందుకు జలమండలి అందుబాటులోకి తెచ్చిన వన్ టైమ్ సెటిల్ మెంట్(ఓటీఎస్) స్కీం ఈ రోజు ముగుస్తుంది. ఈ పథకాన్ని ఉపయోగించుకుని ఎలాంటి వడ్డీ, ఆలస్య రుసుం లేకుండా పెండింగ్ నల్లా బిల్లులు చెల్లించవచ్చు.

**PN**

-----------------------

**GHMC**

హైదరాబాద్ మహనగర్ పాలక సంస్థ- జీహెచ్ఎంసీ 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలపై జీహెచ్ఎంసీ కమిషనర్, మేయర్ ఆధ్వర్యంలో ఈ రోజు సమావేశం జరుగుతోంది. స్టాండింగ్ కమిటీలో చర్చ అనంతరం స్టాండింగ్ కౌన్సిల్‌లో బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతారు. గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి మరో 400 కోట్ల రూపాయిలు పెరిగే అవకాశం ఉన్నట్లు సమచారం.

**Desk**

--------------------